క్లుప్తంగా

గ్రీటింగ్స్, పూలకు తగ్గిన ఆదరణ


కొత్తపల్లిలో గ్రీటింగ్ కార్డులు కొంటున్న చిన్నారులు


రంగవల్లుల కోసం సిద్ధంగా ఉన్న రంగులు

కొత్తపల్లి : ఆత్మీయులకు, స్నేహితులకు, కుటుంబ సభ్యులకు మెసేజ్‌లు, ఎస్ఎంఎస్, ఎంఎంఎస్‌లు పంపి తమ అభిమానాన్ని చాటుకుంటున్న ఈ రోజుల్లో గ్రీటింగ్స్, పూలకు ఆదరణ తగ్గిందనే చెప్పవచ్చు. మండలంలో కొత్తపల్లి, ఉప్పాడ, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొండెవరం, మూలపేట, గోర్స కోమరగిరిలో గ్రీటింగ్ షాపులను ఏర్పాటు చేశారు. అయితే అనుకున్న స్థాయిలో విక్రయం లేకపోవడంతో వ్యాపారులు దిగాలపడ్డారు. అంతా సెల్‌ఫోన్‌తో శుభాకాంక్షలు షేర్ చేసుకుంటుంటే గ్రీటింగ్ కార్డులను ఉపయోగించేది తక్కువ మందే. సుదూర ప్రాంతాల్లో ఉన్న శ్రేయోభిలాషులకు, స్నేహితులకు, ఆత్మీయులకు శుభాకాంక్షలు సెల్‌ఫోన్లలో చెప్పేస్తున్నారు.

ఫ్లైఓవర్‌పై స్తంభించిన ట్రాఫిక్


సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో నిలచిన వాహనాలు

సామర్లకోట: అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే సాయంత్రం సమయంలో ఫ్లైఓవర్‌పై గోతులు పూడ్చివేత పనులు ఈ సమస్యకు కారణమైంది. దీంతో బ్రిడ్జికి నాలుగు వైపులా కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి. దీనిపై ట్రాఫిక్ ఎస్సై గరగారావు మాట్లాడుతూ రాత్రి 8 దాటిన తరువాత పనులు చేయాలని ఆర్అండ్‌బీ సిబ్బందికి సూచించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

శ్మశాన వాటిక ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్ చిన్నారావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కొత్తపల్లి: శ్మశాన వాటిక ఆక్రమణపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ నాయకులు అన్నారు. వాకతిప్ప ఎండీపేటలో ఉన్న శ్మశాన వాటిక స్థలం ఆక్రమణపై మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ చిన్నారావుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ వాకతిప్ప ఏడీపీపేటలో ఉన్న సర్వే నంబర్ 95లో 12 సెంట్లు భూమిని మనిషి అంత్యక్రియల కోసం వినియోగిస్తున్నారని, ఆ భూమినికి కూడా కొంతమంది ఆక్రమించి పినిషింగ్ వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జి.అప్పారెడ్డి, కె.నాగేశ్వరరావు, అంగర వాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే


బుల్లి ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న సిబ్బంది

పిఠాపురం: విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు అన్నారు. కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేసిన వి.బుల్లిప్రసాద్ పదవీ విరమణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుల్లి ప్రసాద్ దంపతులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయలో గురువారం ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రవికుమార్ మంగళవారం తెలిపారు. ఎంపీపీ కారే సుధా అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావలలాన్నారు.

న్యూ ఇయర్‌కి స్వాగతం


సామర్లకోట మఠం సెంటర్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న రంగులు


సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో పండ్ల దుకాణం

- బేకరీలు, మిఠాయి దుకాణాలలో సందడి
- పూల దండలు, బొకేలు సిద్ధం
- రాజకీయ నాయకుల ఇళ్లలో విందు ఏర్పాట్లు

సామర్లకోట: నూతన సంవత్సరానికి స్వాగతం చెప్పడానికి ఎక్కడికక్కడ ఏర్పాట్లు చకచకా సాగిపోతున్నాయి. ఇందులో భాగంగా వ్యాపార సంస్థలు వినియోగదారులను ఆకర్షించేలా కేక్‌లు, మిఠాయిలు, పూల దండలు, బొకేలు తయారు చేసి సిద్ధం చేశారు. మహిళలు ఇళ్ల ముందు స్వాగతం చెప్తూ ముగ్గులు వేశారు. ముఖ్య కూడళ్లలో రంగుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రాజకీయ నాయకుల ఇళ్ల వద్ద సందడి ఎక్కువగా ఉంది. అచ్చంపేటలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, సామర్లకోటలో వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, కౌడా చైర్మన్, జనసేన నాయకుడు తుమ్మల బాబు పెద్దాపురం పార్టీ కార్యాలయంలో శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చే వారి కోసం ఏర్పాట్లు చేశారు.

బేకరీలలో అర కేజీ నుంచి 20 కేజీల వరకు కేక్‌లను తయారు చేసి సిద్ధంగా ఉంచారు. పూల వ్యాపారస్తులు రూ.50 నుంచి రూ.500 వరకు విలువైన బొకేలను తయారు చేస్తున్నారు. పూల దండలు, గజమాలలను సిద్ధం చేశారు. శుభాకాంక్షలు చెప్పడానికి యాపిల్, దానిమ్మ, కమలా పండ్లను సిద్ధం చేశారు. ఇక హోటళ్లను విద్యుద్దీపాలతో అలంకరించి వివిధ రకాల ఫ్లేవర్లలో బిర్యానీలు విక్రయించడానికి సిద్ధం చేశారు. డిసెంబరు 31 మంగళవారం కావడంతో మాంసం ప్రియులతో హోటళ్లు నిండి పాయాయి.

న్యూ ఇయర్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

డీఎస్పీ శ్రీహరిరాజు


సామర్లకోటలో వాహనచోదకులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

సామర్లకోట: నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ డి.శ్రీహరిరాజు ప్రజలకు హితవు పలికారు. మంగళవారం స్థానిక పోలీసు అవుట్ పోస్టు వద్ద వాహన చోదకులకు అవగాహన కల్పించారు. కొత్త సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని వాహనాలు వేగంగా నడపడం, మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. రోడ్ల మధ్యలో కేక్ కట్టింగ్ వంటి కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. సైలెన్సర్ తీసి వేసి వాహనాలు నడపడం, మోటారు సైకిళ్లపై ఇద్దరి కంటే ఎక్కువ మంది వెళ్లడం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం వద్దు.. కొత్త ఆలోచనలే ముద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై మౌనిక

పెద్దాపురం: నూతన సంవత్సర వేడుకల్లో యువత మద్యానికి దూరంగా ఉండి కొత్త ఆలోచనతో ముందుకు నడవాలని ఎస్సై మౌనిక అన్నారు. పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్, జేవీవీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మెయిన్‌రోడ్డులో మాదక ద్రవ్యాలు వద్దంటూ ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షురాలు కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్ఐ మౌనిక మాట్లాడుతూ నూతన సంవత్సరాన్ని ప్రజలందరూ కూడా మద్యం, మాదక ద్రవ్యాలతో కాకుండా కొత్త ఆలోచనలతో స్వాగతం పలకాలన్నారు. యువత మద్యం మత్తులో అనేక ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అనంతరం జేఎస్ మున్సిపల్ స్కూల్ నుంచి శివాలయం వీధి, వేములవారి సెంటర్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకులు రవివర్మ, పీసీసీ కార్యదర్శి రొంగల అరుణ్, పీఎస్ఎం నాయకులు డి.కృష్ణ, ఆర్.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై వాడీవేడి చర్చ

- టెండర్లు, పనులపై అధికారుల నిలదీత
- చర్యలు తీసుకుంటామన్న కమిషనర్


సభ్యులకు సమాధానం ఇస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్లు

సామర్లకోట: కౌన్సిల్ ఆమోదం పొందినా టెండర్లు పిలవడం లేదని, టెండర్లు పిలిచినా పనులు ప్రారంభించకపోవడంపై కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షన మంగళవారం సాధారణ సమావేశం జరిగింది. ప్రజా సమస్యలపై చర్చించడానికి జీరో అవర్ కేటాయించడంతో కరణం రాజ్‌కుమార్ మాట్లాడుతూ వార్డులలో తాగునీటి సమస్య, కుక్కల సమస్యను పేర్కొనగా తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఏఈ రమేష్, కుక్కలకు రెండు నెలల తరువాత ఆపరేషన్లు చేస్తారని కమిషనర్ ఎ.శ్రీవిద్య బదులిచ్చారు. గత కౌన్సిల్ సమావేశంలో గోదావరి కాలువ లో వ్యర్థాలు కలుస్తున్నాయని ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, చంద్రశేఖరస్వామి ఆలయం నుంచి ఏలేరు వరకు ఉన్న డ్రైనుకు టెండర్లు పిలిచినా పనులు ప్రారంభించలేదని కౌన్సిలర్ కాళ్ల శ్యామల, యుద్ధప్రాతిపదికన ఆ పనులు ప్రారంభించాలని ఆవాల లక్ష్మీనారాయణ తదితరులు పలు పనులపై డిమాడ్లు చేశారు. డ్రైను విషయమై కమిషనర్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను ఈ పనులకు కేటాయించామని అనుమతులు రావాల్సి ఉందని పేర్కొన్నారు.

టెండర్లు పిలిచినా..

28వ వార్డులో రోడ్డు పనులకు కౌన్సిల్ ఆమోదించి ఏడాది గడిచినా టెండర్లు పిలువ లేదని రెడ్నం సునీత, టెండర్లు పిలిచినా పనులు ప్రారంభించడం లేదని పాగా సురేష్‌కుమార్, సేపెని సురేష్ తదితరులు పేర్కొన్నారు. కౌలు రైతుల పింఛన్లు తొలగిస్తా మని నోటీసులు ఇస్తున్నారని, అన్నా క్యాంటిన్‌లో 150 మందికే భోజనం పెడుతున్నారని నేతల హరిబాబు ఆరోపించారు. దీనికి కమిషనర్ కలగజేసుకుని 350 మందికి భోజనాలు పెట్టాలని ఆదేశించారు.

పూడికతీతపై గరం.. గరం..

మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పూడికతీతపై కౌన్సిల్ సమావేశంలో వాడీ వేడి చర్చ జరిగింది. క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్లు లేకుండా బిల్లులు ఎలా చేస్తారని వైస్ చైర్మన్ మోజెస్ ప్రశ్నించగా, ఇకపై పనుల వద్ద సదరు అధికారి ఉండేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. అలాగే మృతి చెందిన ఔట్ సోర్సింగ్ కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని మోజెస్, చంద్రరావు సూచించారు. వైస్ చైర్మన్ గోకిన సునేత్రాదేవి, అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి కౌన్సిల్ సంతాపం తెలిపారు.

ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ రాజశేఖర్

పెద్దాపురం: పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కౌన్సిలర్లు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ స్థానిక మెయిన్‌రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఉంటే ఈ మూడేళ్లలో అద్దెల రూపంలో సుమారు రూ.కోటి ఆదాయం వచ్చేదన్నారు. భాగ్యశ్రీ గ్యాస్ కంపెనీ తవ్విన గోతులకు గాను వారితో చలానా కట్టించి మున్సిపల్ ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పట్టణంలో అనధికార లే అవుట్లపై చర్యలు లేవని, అనధికారి కుళాయి కనెక్షన్లపైనా చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌన్సిలర్ త్సలికి సత్య భాస్కర్ మాట్లాడుతూ బూస్టర్ వద్ద మంచినీటి సరఫరాకై కుళాయి అందుబాటులో ఉంచాలని, పారిశుధ్య పనులు మెరుగుపర్చాలని పప్పల దుర్గారావు కోరారు. మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా రక్షణ కల్పించాలని వైస్ చైర్మన్ సాయి ప్రసాద్, చైర్ పర్సన్ తులసీ మంగతాయారు ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై వాడివేడి చర్చ సాగింది. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీఈఈ ప్రకాశరావు, ఏఈ జీవప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, ఆర్ఓ చంద్రశేఖరం. మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, వాసంశెట్టి గంగ, కౌన్సిలర్లు ఆరెళ్లి వీర్రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలి


సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

పిఠాపురం: గొల్లప్రోలు పోలీస్ స్టేషన్‌ను ఎదురుగా ఉన్న డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించాలని పలువురు సభ్యులు డిమాండు చేశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సాధారణ సమావేశాన్ని మంగళవారం నగర పంచాయతీ చైర్మన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన నిర్వహించారు. ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా చెత్తను వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చెత్త పేరుకుపోయినపుడు నిప్పు అంటించడంతో వెలువడే పొగతో పరిసర ప్రాంతాల ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అంతేకాకుండా దుర్వాసనతో అనారోగ్యానికి గురవుతున్నారని వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు, కౌన్సిలర్లు బెందుకుర్తి సత్తిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న కాలనీలో ప్రజలకు తాగునీరు అందక అవస్థలు పడుతున్నారని, ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని కౌన్సిలర్ మైనం భవానీ అన్నారు. పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ తెడ్లపు అలేఖ్య రాణి, కౌన్సిలర్లు గంటా అప్పల స్వామి, మొగలి దొరబాబు, దాసం దేవి, సింగం నాగేశ్వరావు, గంద్రేటి రాము తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల కమిటీ సభ్యులకు శిక్షణ


మండల స్థాయి పాఠశాలల నిర్వహణ కమిటీకి శిక్షణ ఇస్తున్న అధికారులు

కొత్తపల్లి: స్థానిక జిల్లా ప్రజా పరిషత్ బాలుర పాఠశాలలో మంగళవారం మండలస్థాయి పాఠశాల నిర్వహణ కమిటీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలో ఉన్న 67 పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు పాఠశాల అభివృద్ధి, నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు వేణుగోపాల్, పైడిరాజు, సమగ్ర శిక్షా సీఎంఓ చామంతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాదిగలకు న్యాయం చేయాలి


సామర్లకోట తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాదిగ సంఘ నాయకలు

సామర్లకోట: ఎస్సీ వర్గీకరణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల సర్వేలో మాదిగలకు న్యాయం చేయాలని మాదిగ దండోరా సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. మాదిగ కులానికి చెందిన అనేక మందిని మాలలుగా చూపించారన్నారని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ వల్లూరి నాని మాదిగ అన్నారు. ఈ తప్పుడు సర్వే వల్ల తమ కులానికి చెందిన వారికి తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. దీనిపై అనేక అభ్యంతరాలు రావడంతో అధికారులు తిరిగి సర్వే ప్రారంభించాలన్నారు. ఈ మేరకు అధికారులు మాదిగ పేటలోనికి వచ్చి సర్వే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వే కాలాన్ని కూడా పెంచాలన్నారు. కార్యక్రమంలో మాదిగ దండోరా సంఘ నాయకులు ఎం.రాజు, ఎం.వెంకన్న, రాజ్‌కుమార్, అశోక్‌లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన


పెద్దాపురంలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న బాబు, సూరిబాబు రాజు


బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

సామర్లకోట: మండల పరిధిలో విద్యార్థులకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. గణితావధాని సాయిరామకృష్ణ అధ్యక్షతన సాగిన కార్యక్రమంలో మొదటి మూడు స్థానాలు సాధించిన ప్రదర్శనలకు అధికారులు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయిలో మరింత ఆకర్షనీయమైన ప్రాజెక్టులు తయారు చేయాలని సూచించారు.


సామర్లకోటలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

లూథరన్ హైస్కూలులో..

పెద్దాపురం: స్థానిక లూథరన్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనను కౌడా చైర్మన్ తుమ్మల బాబు మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజుతో కలిసి ప్రారంభించారు. డీవైఈఓ శర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సైన్స్ ప్రదర్శనలను వారు పరిశీలించారు. ఎంఈఓ చౌదరి, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిఠాపురంలో..

పిఠాపురం: స్థానిక బీఎంఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి పాఠశాలల విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో విద్యార్థులు 46 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఠాపురం మండల విద్యాశాఖ అధికారులు జి.శ్యాంబాబు, కేటీ నారాయణదాసు మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్ర సాంకేతిక రంగాలలో అభిరుచిని ప్రతిభను వెలికితీయడమే ఈ వైజ్ఞానిక ప్రదర్శన లక్ష్యమన్నారు. ఇటువంటి ప్రదర్శన వలన గ్రామీణ ప్రాంతాల్లో మంచి ప్రతిభ కలిగిన విద్యార్థులను గుర్తించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల సీఎంసీ చైర్మన్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.